జరిపారు. ఓ గుండు గురి తప్పింది. మరొకటి అతని చొక్కా జేబులోకి దిగింది. అతని మిత్రుడు కానుకగా ఇచ్చిన భగవద్గీత గుండెకి అడ్డుగా ఉండటంతో గుండు అందులో దిగి ఆగిపోయింది.

దేవుడు తనని ఆ విధంగా ఓ అద్భుత సంఘటన ద్వారా కాపాడటం అతనికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆ రోజునించి నాస్తికుడు అయిన రంగారావు ఆస్తికుడు అయ్యాడు.

## 92. దేవుడికి వదులు

ఓ రాజు తన మంత్రులతో కూర్చుని ప్రపంచాన్ని బాగు చేయడానికి ఏం చర్యలు చేపట్టాలా అని కొద్ది రోజులుగా అదే పనిగా మంతనాలు జరుపుతున్నాడు. ఈ సంగతి తెలిసిన రాజ గురువు రాజు దగ్గరకి వచ్చి అడిగాడు.

"రాజా! ఈ ప్రపంచాన్ని నడిపించేది ఎవరో నీకు తెలుసా?"

"తెలుసు గురుదేవా! దేవుడే ఈ ప్రపంచాన్ని నడిపించేది." జవాబు చెప్పాడు ఆ రాజు.

"నువ్వు పుట్టక మునుపు?"

"దేవుడే."

"నువ్వు మరణించాక?"

"దేవుడే నడిపిస్తాడు."

"అంటే నువ్వు పుట్టక మునుపు, నీ తదనంతరం ఈ ప్రపంచాన్ని దేవుడే నడుపుతాడంటావు?"

"అవును గురుదేవా."

"మరి నువ్వు జీవించి వున్నప్పుడు కూడా ఆ భారాన్ని దేవుడికే వదలక ఎందుకు ఈ ప్రపంచాన్ని ఉద్ధరించాలని సతమతమవుతున్నావు?" నవ్వుతూ ప్రశ్నించాడు గురువు.

రాజుకి గురువు బోధ అర్ధమైంది. ప్రపంచం సంగతి మాని తన దేశ ప్రజల గురించే అప్పటి నించి ఆలోచించసాగాడు.